పార్వతి

—శివరామ్—

ఊరినుంచి వచ్చి అప్పుడే యింట్లో ప్రవేశించిన శ్రీమన్నారాయణగారు కాళ్లూ, చేతులూ, ముఖం కడుక్కొని, పడక కుర్చీలో వాలి "హమ్మయ్య-" అనుకుంటూ, అక్కడే నేలమీద పడివున్న, తుండుతో ముఖం తుడుచుకుంటూంటే, ఆయనభార్య జ్ఞానాంబ, నవ్వుతూ మరచెంబూ, నీళ్లతో అక్కడికి వచ్చి "ఏమండీ? ఏమిటండీ విశేషాలు?" అని అడిగింది.

శ్రీమన్నారాయణగారు జవాబివ్వక, నిదానంగా భార్యవయిపు చూస్తూ, సన్నగా నవ్వి, కొద్దిగా తీర్థంపుచ్చుకొన్నాడు.

"ఏమండీ మాట్లాడరు...ఏమయినా సంబంధాలు తగిలాయా? లేక వెళ్లినట్లుగానే తిరిగివచ్చారా?"

"వెళ్లినట్లుగా తిరిగిరావటంయేమిటి? ఫస్టుక్లాసయిన కుఱ్ఱవాడ్ని చూసివచ్చాను...ఆ కుఱ్ఱవాడ్ని నేనే మోహించానంటే నమ్మ" చమత్కారంగా శ్రీమన్నారాయణగారంటూంటే—

"చాల్లెద్దురూ...మీ వేళాకోళాలూ... మీరూను. వాటికి సమయం, సందర్భం వుండక్కర లేదూ?"—అని జ్ఞానాంబ చిరుకోపం ప్రదర్శించబోయింది.

"నిజంగా నేనే...నీతో నే నెప్పుడైనా అబద్ధం ఆడానా?"-భర్త పై విధంగా మాటలనటంతోటే, జ్ఞానాంబకు కుతూహలం వృద్ధిఅయింది "నిజంగానే, కుఱ్ఱవాడేలాగుంటాడు? ఏం చదువుకొన్నాడు? వాళ్లింటిపేరేమిటి? ఏమాత్రం ఆస్తిపాస్తులున్నాయి? ఎంతమంది పిల్లలున్నారు? ఆ అబ్బాయి తల్లితండ్రు లెటువంటివాళ్లు?" - ఈ ప్రశ్నలన్నీ ఒకదానితరువాత ఒకటిగా ఆవిడ అడిగేసింది.

శ్రీమన్నారాయణగారు నవ్వుతూ యీ విధంగా చెప్పాడు: "కుఱ్ఱవాడిపేరు శేషగిరి. బి. ఏ. సీనియరు చదువుతున్నాడు. ఈ దినమే కుఱ్ఱవాడ్ని, మిత్రుడు సుదర్శనం చూపగా కళ్లారాచూశాను. మంచి అందంగా వుంటాడు; ఆ అందానికితోడు వినయ, విధేయతలు; చాలా మృదువైన కంఠం. మంచి సంప్రదాయ కుటుంబానికి చెందిన కుఱ్ఱవాడు. తండ్రిపేరు పున్నయ్యగారు. తహశీలుదారు వుద్యోగంచేసి రిటైరై మంచి పేరుప్రతిష్ఠలు సంపాదించుకొన్నారాయన. వారికి యితడు ఒక్కగానొక్క కొడుకు..." ఈ విధంగా భర్త చెబుతూంటే విషయాలన్నీ అనుకూలంగా వుండటంవల్ల జ్ఞానాంబ వింటూ మురిసిపోతూంది.

"శేషగిరితప్ప వేరు ఆడసంతానమయినా వారికి లేదు-పిల్లవాడ్ని-వాళ్లు పువ్వుల్లో పెట్టి పెద్దచేసుకుంటున్నారు...ఆస్తి ఏభైఎకరాల పొలంవుంది; పాతిక వేలరూపాయల క్యాషు, ఒక మేడ - పున్నయ్యగారికి వున్నాయి. చదువుకొన్నదీ, వినయ విధేయ తలు కలిగి, చురుకైనదీ పడుచుపిల్లను కోడలుగా స్వీకరించాలని వాళ్ళ తలంపు. అన్నివిధాలా...మనకు తగిన సంబంధం...మన పార్వతిలో - ఆ చదువు సంధ్యలూ - అందచందాలూ - వినయ విధేయతలూ అమరివున్నాయి...అందువల్ల మరి ఆటంకాలేమి వుంటాయ్?" - శ్రీమన్నారాయణగారింకా యేమిటో చెప్పబోతూంటే- కాంతితో నిండిన ముఖాన్ని చిన్న బుచ్చుకొని: "మంచిపని చేసుకువచ్చారు. అటువంటి సంబంధాలజోలికి మనం పోవటం యెందుకు చెప్పండి?" అంది జ్ఞానాంబ.

'అంటే'- శ్రీమన్నారాయణగారు ఏమీ అర్థంకాని పరిస్థితిలో తెల్లముఖం వేశాడు.

"ఏంవుందండీ? ఆ సంబంధం అన్ని విధాలా మన కనుకూలంగా వుంటేమాత్రం, మన పార్వతికి - తగినదయితే మాత్రం - వారు ఆకాశంమీద కూర్చుని కోరికోర్కెలు తీర్చే స్థితిలో మనం లేనప్పుడు అటువంటి సంబంధం మీరు చూసిరావడం యెందుకు చెప్పండి? వారు కట్నకానుకలగా ఏ పదివేలో అడుగుతారు? యేవేవో లాంఛనాలపేరుతో మరో రెండుమూడు వేలు గుంజ ప్రయత్నిస్తారు... పెళ్ళి చేయ్యటానికి మరో నాలుగు వేలు...మన ఆస్తిపాస్తులన్నీ తెగ అమ్మకుంటే పదిహేను వేలు చెయ్యవే... అటువంటప్పుడు - అటువంటి సంబంధాన్ని తెచ్చుకొని, అమ్మాయికి పెళ్ళి యేలాగ చేయగలుగుతామండీ! పోనీ ఒక్క పార్వతే అనుకుంటే - పార్వతితర్వాత మరో అయిదుగురమ్మాయిలున్నారు గదా? వాళ్లగతేం కావండీ? మీరు యేంచేదా మనుకుంటున్నారోగాని, - మన పిల్లల్ని తలుచుకుంటూంటే - హృదయం యెంతగానో క్షోభిస్తుంది...కన్నబిడ్డలకు- తగినవరులను చూచి వివాహంచేసి, బాధ్యత తీర్చుకోలేని కరకు మనుష్యులం....మనం" - యీ విధంగా జ్ఞానాంబ - బాధ వెడలగ్రక్కుతూ యేమిటేమిటో అంటూంటే -

శ్రీమన్నారాయణగారి కళ్ళల్లో గూడా, నీళ్లునిల్చాయి. ఆయన కొంతసేపు ఆగి: "అవును నువ్వు అన్నమాటల్లో అసత్యం లేదు.... కానీ"- అని ఆయన ఆగిపోయాడు.

"ఏమిటది?" - జ్ఞానాంబ భర్త వయిపు చూసింది...

"ముందు భవిష్యత్తు యేవిధంగా వున్నా - పార్వతికి - తగిన వరుడ్ని చూచి పెళ్ళి చేయాలనే - తలంపుమూలంగానే యీ సంబంధం చూడటం జరిగింది. సత్సంప్రదాయాలతో నిండిన - ఆ సంబంధాన్నే - పార్వతికి నిశ్చయించాలనే నా తలంపు - ఆ కుఱ్ఱవాడ్ని చూడటంతోటే మరింత దృఢపడింది. పైగా - సుదర్శనం - ఒక మాటకూడా అన్నాడు. తహసీలుదారు వుద్యోగంచేసి, ఫించను పుచ్చుకుంటున్న పున్నయ్యగారికి కట్నకానుకలమీద ఆశ లేదనీ - వారికి కావలసింది, పిల్ల నచ్చటం అనీ, పిల్లనచ్చినపక్షంలో - వాటిని గురించి వాళ్లు అంతగా పట్టించుకోరని తాననుకుంటున్నాననీ అన్నాడు. పున్నయ్యగారు వొకప్పుడు - "కట్నకానుకలు పుచ్చుకోకూడదని" - బహిరంగ ఉపన్యాసాలిచ్చేవాడట. అందువల్ల - ఒకవేళ కోరినా యేవో లాంఛనప్రాయంగా-కోరటం జరుగుతుందికానీ-మనకు దానివల్ల కలిగేయిబ్బంది ఆట్టేవుండదని అతనన్నాడు. సుదర్శనం పున్నయ్యగారి పొరుగువాడవటంవల్ల, ఆయన మంచి చెడ్డలు - అతగాడికి బాగా తెలిసి వుంటాయనుకుంటూ - అతడితో కలసి వాళ్లి యింటికి వెళ్లాను... పున్నయ్యగారు, ఆయనభార్యా, యెంతో తీయగా మాట్లాడారు. సుదర్శనం, మన అమ్మాయిసంగతి చెప్పాడు. నేను పార్వతి ఫోటో వాళ్ళకిచ్చాను. చూసి, సంతృప్తి వెల్లడించి "అవశ్యం చూడటానికి వస్తాం... అబ్బాయికి త్వరగా పెళ్ళి చేసేయాలి" —

అన్నారు పున్నయ్యగారు. "కోడలు రాక కోసం - నేనెంతో కాలంనుంచి యెదురు చూస్తున్నాను. ఏమిటో అశ్రద్ధ అయిపోతూంది...తప్పక త్వరగా పెండ్లిచేయాలి" అంది యజమానురాలు ... అప్పటి కప్పుడే మంచిదినంచూడటం జరిగింది. వచ్చే ఆదివారం తాము తప్పక రాగలమని పున్నయ్యగారు చెప్పారు ...

వచ్చేస్తూ: "ఈ బీదవాడిమీద నొకకన్ను వేయండి" - అన్నాను నేను తమాషాగా!

ఆయన నొచ్చుకుంటూ: "ఆ...యెంత మాట సెలవిచ్చారు? గొప్పా...బీదా యేమిటండీ? పుట్టినప్పుడంతా డబ్బుతో పుటారా? వచ్చేటప్పుడు డబ్బుతో వస్తారా! మీరటువంటి మాటలంటే నా మనస్సు చాలా బాధపడుతుంది. అంతా నొకటే" అన్నారాయన.

"ఈవిధంగా వుదారంగా ఆయన మాటాడుతూంటే నే యేమనుకోవాలి? అసలాయన కట్నకానుకలు కోరడనే, నా వుద్దేశం - అన్నాడు - సుదర్శనం. ఒకవేళ కోరినా గొప్ప - బీదల తారతమ్యం గుర్తించిన వ్యక్తి కనుక - యేకొద్దిమొత్తమో - మనశక్తి ననుసరించి కోరుతాడనుకొన్నాను నేను. అందువల్ల ...."

ఇప్పటికి జ్ఞానాంబకు, సంతృప్తి కలిగినట్లుంది "అవును. అటువంటి మహానుభావులుమాత్రం వుండకూడ దేమిటి? - మనం అదృష్టవంతులమైతే - ఆ సంబంధం మనకే కుదరకూడదూ? కట్నకానుకలు మేంపుచ్చుకోమని వాళ్ళనకూడదూ! అంతా-పార్వతి అదృష్టం. ఇంతకీ ఆ అబ్బాయి ఫోటో తెచ్చారా?" - అని అడిగిందావిడ.

"ఆ" అంటూ శ్రీమన్నారాయణగారు ఫోటోతీసి భార్యకిచ్చాడు.

ఆవిడ జాగ్రత్తగా పరిశీలించి, సంతృప్తి వెల్లడిస్తూ: "మనకదృష్టం వుంటే యీ సంబంధం నిశ్చయం అవుతుంది"—

"ఇంతకీ పిల్లలంతా యేరీ? పార్వతి యెక్కడ?" - శ్రీమన్నారాయణగారడిగాడు.

"పార్వతి గదిలో యేదో కుట్టుకుంటోంది. పిల్లలంతా, ప్రక్కయింటికి వెళ్లారు...ఇంతకీ..దానికి కుఱ్ఱవాడి ఫోటో చూపలేదు యింకా! అదిచూచి, ఒప్పుకొని సంతోషించాలి కదా" - అంటూ జ్ఞానాంబ, పార్వతివున్న గదివయిపు నడచింది. శ్రీమన్నారాయణగారేమిటో ఆలోచించటం ప్రారంభించాడు.

* * *

పెళ్ళివారు, పార్వతిని చూసుకోటానికి బయలుదేరి వస్తామన్న ఆదివారం వచ్చింది..

ఆ మధ్యాహ్నం..రెండుగంటల బండికి, వస్తున్నట్లుగా, పున్నయ్యగారి దగ్గరనుంచి, అంతకు రెండురోజుల క్రితమే వుత్తరం గూడా వచ్చింది. మిత్రుడు సుదర్శనంతో, యిదివరలో, యీ సమయంలో రావలసిందని, శ్రీమన్నారాయణగారు చెప్పాడు. కానీ తనకు రావటానికి వీలుండదంటూ - అతడు వుత్తరం వ్రాశాడు.

శ్రీమన్నారాయణగారు పెద్దగా ఆస్తిపాస్తులున్న వ్యక్తికాదు. ఆ సంగతి మీ అందరికీ తెలుసు. అయితే - వియ్యమందతలబోస్తున్న, పున్నయ్యగారి, ఐశ్వర్యాన్ని హోదాను పుణికిపుచ్చుకొని- పెద్దయెత్తున యింట్లో యేర్పాట్లు చేశాడు. ఇంచుమించుగా, డెబ్భైరూపాయలు - పెళ్లివారి రాక సందర్భంలో ఆయన, యింటికి ఖర్చులు చేశాడు. తాను "వాళ్ళఅంతస్థుకు-తూగ గలవాడు కాకపోయినా - అటువంటి వారి నెయ్యం వాంఛిస్తున్నందున ఆ విధంగా భేషజం ప్రదర్శించాలని, ఆయన అనుకొన్నాడు - అందులోనూ యిదే- మొదలు ఆయన పెళ్లివారి నాహ్వానించటం! ఇల్లంతా యెరువుతేబడిన అలంకరణలతో అలంకరించబడింది...పిల్లలందరికీ శుభ్రంగా కన్పడటంకోసం - మరో యేభైరూపాయలు ఖర్చుచేసి, బట్టలు కుట్టించాడాయన. మరో గంటకు రైలు వస్తుందనగా - జ్ఞానాంబ, పిల్లలందరినీ ముస్తాబుచేసింది; పార్వతి, తల్లికి పనుల్లో సహాయపడుతూంది....కాని తల్లి ఆమె సహాయం ఆశించటంలేదు. పిల్ల యెక్కడ కందిపోతుందో అని ఆవిడభయం. "నీగొడవ నువ్వు చూసుకుందూ—"అంటూ చిన్నగా పార్వతిని కసురుకొని, ఆమె యేమో చేస్తూంటే, పెళ్ళివారియెదుట, పెండ్లికుమార్తెగా - నడుచుకోవలసినవిధం గురించి, ఆవిడ యెంతగానో చెబుతూంది. పార్వతి నిశ్శబ్దంగా వూకొట్టుతూంది...

* * *

మరో అరగంట అనంతరం—

శ్రీమన్నారాయణగారు, యేకాంతంగా పార్వతిని పిలచాడు...

"వద్దు, వద్దంటు"న్నా "ఫరవాలేదు... ఇటువంటి సమయాల్లో తప్పక వేసుకోవాలి" అని - బలవంతంచేసి, అలంకరణంచేసిన యెరువు నగలతోనూ, నూతన వస్త్రాలతోనూ - చక్కగా, యిరుగుపొరుగు అమ్మలక్కలచేత అలంకరింపబడిన పదహారు సంవత్సరాలపడుచు పార్వతి - ఒక దివ్యాంగన విధంగా తండ్రి యెదుటకు వచ్చినిల్చుంది..

శ్రీమన్నారాయణగారు, కుమార్తెను, పిలచిన సంగతి మరచి యేకదీక్షతో చూసి, తనతో తాను యెంతగానో ఆనందాన్ని అనుభవిస్తూ యేమిటో యోచిస్తున్నాడు. నిజంగా - పార్వతి - తనకు కూతురై పుట్టినందుకు తానెంత అదృష్టవంతుడు? చదువుకు చదువు; రూపానికి రూపం; వినయానికి వినయం - నేర్పుకు - నేర్పు - ఓర్పుకు- ఓర్పు అన్నీ పార్వతిలో మూర్తీభవించి వున్నాయి... పార్వతినీ చేబట్టే యువకుడు యెంత అదృష్టవంతుడవుతాడో! ఛీ అవేం ఆలోచనలూ ... పార్వతికోసం - తానొక ఘస్లకొనుసంబంధం తీసుకువస్తే - ఏ విధంగానైనా- సరే - కావలసివస్తే - వలసినకట్నం యిచ్చయినాసరే ఆ సంబంధాన్ని నిశ్చయం చేసుకుతీరాలి...

"ఏమిటి నాన్నా! నన్ను పిలిచారట-" అంది పార్వతి...

పైవిధంగా ఆలోచనల్లో మునిగితేలుతున్న - శ్రీమన్నారాయణగారు తేరుకొని, చిన్నగా నవ్వుతూ! "ఆ పిలిచానమ్మా.."- అన్నాడు...

"ఎందుకూ?—" మృదువుగా అడిగింది పార్వతి.

"ఏం లేదమ్మా...ఒక మాట...నువ్వు తెలివయినపిల్లవ్ ... మా అదృష్టంకొద్దీ - మా అమ్మాయివై పుట్టావు...నీకుతగిన సంబంధం తీసుకురావటానికి నేనెంతగానో శ్రమపడ్డాను. ఈనాడు - రాబోయే సంబంధం, మన కదృష్టంకొద్దీ తారసపడ్డది - వారు సౌమ్యులు. పెద్దగా ఆస్థిపాస్థులు గల గొప్ప కుటుంబీకులు. వారితో మనం తూగలేం కాని- గౌరవమర్యాదలూ- గుణగోత్రాలూ- వారితో సరితూగగలవు. వారు కొన్ని ఆదర్శాలు కలవారు కనక -తప్పక ఒప్పుకుంటారని నానమ్మకం - ఏమైనా - వారు నిన్ను యేమైనా అడిగితే వినయంగా జవాబియ్యి ఓర్పు వహించు. అంతకంటె నువ్వేమీ చేయనక్కరలేదు తల్లీ...ఇక మిగిలినసంగతులు పరిస్థితులనుబట్టి నేను చూసుకుంటా."

పార్వతి తండ్రివయిపు ఒకమాటుచూసి "నాన్నా నాదీ ఒకమాట" అంది.

"ఏమిటమ్మా అది?"

"మీరు చెప్పిన విధంగా - కుమార్తెగా నా విధి నేను తప్పక నిర్వర్తించుకుంటాను. కానీ నా కోసం మీరుమాత్రం" - పార్వతి కంఠం రుద్ధమైంది.

"చెప్పమ్మా... చెప్పు"- శ్రీమన్నారాయణగారు ఆదుర్దా కన్పర్చాడు.

"నాకోసం-మీరు - వారు కోరే కట్నం యివ్వ సిద్ధపడవద్దు. వారు కోరేది....యెంతైనా అవవచ్చు. వారిమీదవుంటే మక్కువ

కొద్దీ-మన అంతస్థుసంగతి మరచి, మీరు 'వూ' కొడతారు. తరువాత యేమనుకుంటే యేంలాభం? మన యింటిపరిస్థితులు - నా చెల్లెళ్ళ భవిష్యత్తూగూడా మీ మనసులో వుంచుకోండి. నాన్నా! నాకు పెండ్లిచేయటంతోటే మీ బాధ్యత తీరిపోదు...నన్ను సుఖపెట్టాలని ఆరాటపడుతున్న మీమనస్సు చెల్లెళ్ళ సౌఖ్యం మంచీ మాత్రం వాంఛించదూ? మరోవిధంగా అనుకోకండి. ఆడపిల్లనయితేమాత్రం-చదువుకొన్న చదువును సార్థకం చేసుకుంటాను. అవసరమయితే - కన్యగానే వుంటాను కానీ నాకోసం-వెట్టిగా-వేలుయోగజిమ్మ శిద్ధపడకండి. మన కుటుంబం భవిష్యత్తుగూడా ఆలోచించండి."

కూతురు వుద్దేశాలు పూర్తిగా గుర్తించిన శ్రీమన్నారాయణగారు "అవునమ్మా... కానీ"-అని యేమో అనబోయాడు.

"తిరిగి కానీ ఏమిటినాన్నా..."

"అదికాదమ్మా...నీ అదృష్టం మంచిదయితే-వారసలు కట్నమే కోరకపోవచ్చు. పున్నయ్యగారు-కట్నాలను పుచ్చుకోకూడదని పూర్వం వుపన్యాసాలిచ్చేవారట. ఒకవేళ కోరినా - ఏదో లాంఛనప్రాయంగా కోరవచ్చు...ఈ రోజుల్లో కట్నం పుచ్చుకోటం, లాంఛనాలలో జమయింది. అందువల్ల-అనవసరంగా నువ్వు దిగులుపడకు... నేను అన్నీ చూసుకుంటాను." వారడిగిన ప్రశ్నలకు-అందంగా సమాధానాలియ్యి. అంతే!" అన్నాడాయన.

"కట్నం....మాత్రం..." - పార్వతి తండ్రితో యింకా యేమో అనబోయింది.

"అబ్బ ఆ గొడవ నీ కెందుకమ్మా...నే చూసుకుంటాగా. మరి లోపలికి వెళ్ళు"-అని శ్రీమన్నారాయణగారనటం తడవుగా—పార్వతి యేమిటో ఆలోచిస్తూ, యింట్లోకి వెళ్ళిపోయింది.

* * *

ఆ రోజు రెండుగంటలకు రావలసినబండి ఒకగంట లేటుతో, మూడుగంటలకు స్టేషనుకు వచ్చింది...

మూడుంపావుకు స్టేషనునుంచి, పున్నయ్యదంపతులు, కుమారుడు శేషగిరితోనూ, పురోహితుడితోనూ, జట్కాలమీద శ్రీమన్నారాయణగారింటికి వచ్చారు.

అతిథిసత్కారాలూ, కుశలప్రశ్నలూ - ఒకదానితరువాత, మరొకటి జరిగిపోయినాయి.

తాంబూలాచరణం జరుపుతూ "ఆ... అమ్మాయిని ఒకమారు తీసుకువస్తే"— అన్నాడు పున్నయ్యగారు.

"అవశ్యం" అంటూ శ్రీమన్నారాయణగారు లోపలకు వెళ్ళివచ్చాడు. మరి కొద్ది నిముషాల అనంతరం—

అక్కడ పరచివున్న తివాసీమీదకు—జ్ఞానాంబా, ముత్తయిదువులు - వెంటనంటి తీసుకురాగా - పార్వతి, పార్వతీదేవిలాగ వచ్చికూర్చుంది.

పెళ్ళివారిచూపులు పార్వతివైపు నడిచాయి...

పున్నయ్యగారు సంతృప్తికరంగా పార్వతినిచూసి "పేరమ్మా?" అని అడిగాడు!

"పార్వతి"-పార్వతి జవాబిచ్చింది!

"అచ్చంగా పార్వతివే"-అన్నాడాయన భార్యవైపు చూస్తూ.

లక్ష్మీందేవమ్మ సంతృప్తికరంగా, భర్తవైపు చూసింది.

పార్వతి సిగ్గుతో తలదించుకొని, క్రీగంట శేషగిరివైపు చూస్తోంది.

శేషగిరిదృష్టి యెప్పుడో పార్వతిమీద నిలచింది. నిజం చెప్పద్దూ?

ఈ సంబంధం వచ్చిననాడే అతడు పార్వతిఫోటో చూశాడు. ఆ ఛాయాచిత్రం చూడటంతోటే - అతడి హృదయములో పార్వతికి స్థానం యేర్పడింది. నేడామెను-కళ్ళారా చూచి ఆనందించగలుగుతున్నాడంటే! తాను వాంఛించే స్త్రీలక్షణాలన్నీ ఆమె వదనంలో కన్పిస్తున్నాయి. పైగా మృదువైన కంఠం ... చక్కని పలువరుస.

శేషగిరి తదేకదృష్టితో ఆమెను చూస్తున్నాడు. బెదురుతూ బెదురుతూ చూస్తున్న పార్వతిచూపులూ, శేషగిరిచూపులూ ఒక్కసారిగా కలుసుకొన్నాయి.

అది గమనించిన, అక్కడ వున్నవాళ్లంతా వొక్కమారు నవ్వారు; అవసరం తనదికనుక - వాళ్ళతోబాటు తానూ నవ్వాడు శ్రీమన్నారాయణగారు!

శేషగిరీ, పార్వతీ సిగ్గుపడిపోయారు...

అదిగమనించిన పున్నయ్యగారు: "తప్పేముందీ? ఒకళ్లనొకళ్లు ... చూసుకోకుంటే అభిప్రాయాలెలా యేర్పడుతాయి? యివి పూర్వంరోజులు కాదుగదా!" అన్నాడు.

"చిత్తం" - అన్నాడు విధేయత ప్రదర్శిస్తూ శ్రీమన్నారాయణగారు.

"సరి...నువ్వేమి చదువుకొన్నావమ్మా" ఇది పున్నయ్యగారి ప్రశ్న.

శ్రీమన్నారాయణగారేమో చెప్పబోయాడు - కానీ ఆయన అడ్డువచ్చి: "ఆగండి ఆ అమ్మాయినే చెప్పనివ్వండి. అబ్బాయి విని ఆనందిస్తాడు" అన్నాడు.. అంతటితో శ్రీమన్నారాయణగారు తగ్గిపోయాడు.

"ఏం అమ్మా?"

"థర్డుఫారం ప్యాసయ్యానండి."

"బాగుంది. ఈ కాలం ఆడవాళ్ళకు ఆమాత్రంచదువు చాలు" - అంటూ కొడుకువయిపు చూశాడాయన. ఔనన్నట్లుగా బుఱ్ఱ వూపాడు శేషగిరి.

"హిందీ యేమైనా చదువుకొన్నావా అమ్మా?"

"మాధ్యమికపరీక్ష ప్యాసయ్యానండి"

"భేష్..." - అంటూ భార్యవైపు చూశాడాయన.

"ఏమయినా పాటలు వచ్చునా అమ్మా" లక్ష్మీందేవమ్మ అడిగింది. కానీ - తల్లిప్రశ్న కుమారుడికి నచ్చనందువల్ల: "అది కాదు సంగీతంలో యేమైనా ప్రవేశంవుందా?" - అని అతగాడు ప్రశ్నించాడు.

సిగ్గును ఒకమూలకు నెట్టి, ఓరగా అతడివయిపు చూస్తూ: "ఆ" - అంది పార్వతి.

"వాద్యం యేమైనా"

ఎస్ట్రెలా బ్యాటరీస్ లిమిటెడ్. బొంబాయి-మద్రాస్-ఢిల్లి-నాగపూరు-కాన్పూరు-కలకత్తా

అబ్బ! ఒకే జలుబు...భారము...

అమృతాంజనం వాడితే...



తగ్గిపోయింది!

అమృతాంజనము

"హార్మోనియం వాయిస్తాను."

"ఏమైనా పాటపాడుతూ వాయించ గలరా?"

"ఆ" - ఈవిధంగా, వాళ్ళియిద్దరి మధ్యా కొద్దికాలం సంభాషణ సాగింది. సిగ్గును దూరంగా మెల్లిగా మెల్లిగా వదులుతూ వాళ్లు మాటలాడుకున్నారు. అక్కడ వున్న వాళ్లంతా వాళ్ళవయిపు ఆనందంతోనూ, ఆశ్చర్యంతోనూ చూస్తున్నారు.

శ్రీమన్నారాయణగారు యింట్లోంచి హార్మోనియం తెప్పించాడు. పార్వతి వాయించబోతూ "ఏం పాడేది?" అన్నట్లుగా శేషగిరివయిపు చూసింది ...

శేషగిరి కొంచెంసేపు యోచించి: "ఏమైనా సినీమాపాటలు వచ్చా?" - అని అడిగాడు. పార్వతి తలవూపింది.

"ఈ కాలం పిల్లలు సినిమాపాటలంటే - చెవి కోసుకుంటారు" - అని పున్నయ్యగారంటూంటే -

"గుణసుందరి సినీమాలో పాటలు బాగుంటాయ్" - అంద లక్ష్మిందేవమ్మ.

తల్లికోర్కె, తీర్చ సిద్ధపడ్డాడు తనయుడు.

"ఊఁ. అంగులోపాట వొకటి పాడండి"- అన్నాడు శేషగిరి.

పార్వతి - గుణసుందరి సినీమాలోని "శ్రీతులసి" - అనే పాట హార్మోనియం వాయిస్తూ పాడింది.

పాట పూర్తవటంతోటే "బాగుంది" అని పున్నయ్యగారు మెచ్చుకొన్నారు. శేషగిరి, స్వతహాగా, సంగీతప్రియుడవటం వల్ల, అంతటితో వూరుకోనక - మరొక పాట పార్వతిచేత పాడించాడు.

ఆమె, చిరునవ్వు నవ్వి, ఆపాటగూడా పాడింది.

అది పూర్తవబోతూంటే "ఆట్టే పాడించ గూడదు... అమ్మాయి అలసిపోతుంది—" అన్నాడు, నవ్వుతూ పున్నయ్యగారు...

శేషగిరి, పార్వతీ సిగ్గుపడుతూంటే - అంతా ఒకమారు నవ్వుకొన్నారు.

"సరి - అమ్మాయికి వంటచేయటం వచ్చునాండీ?-" లక్ష్మిందేవమ్మ అవబోయేవియ్యపురాలు జ్ఞానాంబవయిపుచూసి అడిగింది... జ్ఞానాంబ నవ్వుతూ! "పిండి వంటలతో సహితం - మాఅమ్మాయి చక్కగా వంట చేస్తుంది-" అంది...

"సరి .... యిల్లు శుభ్రపరచటం - వంట పనులు చేసుకోటం - ఈ కాలంలో చాలా మంది ఆడపిల్లలకు తెలియవులెండి.... మీ అమ్మాయి మాత్రం..."

"మా అమ్మాయి అటువంటిపిల్ల కాదులెండి-" జ్ఞానాంబ నవ్వింది.

"సరి మేం అదృష్టవంతులం."

"ఏమైనా కుట్లూ కుట్టగలదాండీ?-" ఇది పున్నయ్యగారి ప్రశ్న!

"మీ తలగడాగలీబులు, రంగుదారాలతో కుట్టాలా?" లక్ష్మిందేవమ్మ నవ్వింది...

"ఓ". అంది జ్ఞానాంబ...

"సరయితే"- అని లక్ష్మిందేవమ్మ....భర్తవయిపు చూసింది.

అంతా, మరోమారు తమాషాగా నవ్వుకొన్నారు...

"మరి అమ్మాయిని లోపలికి తీసుకుపొండి ...మేం మాట్లాడుకుంటాం"-అని పున్నయ్యగారంటూంటే, జ్ఞానాంబ, మరితర ముత్తైదువులూ, పార్వతిని లోపలకు తీసుకుపోయారు...

పున్నయ్యగారు, పురోహితుడివైపు చూస్తూ!... "ఇక మీపని తర్వాయి" అని నవ్వాడు...

"చిత్తం"-అని ఆయన చేదస్తంగా అని.. శేషగిరివయిపుచూసి! "ఏం బాబూ ... అమ్మాయి మీకు నచ్చినట్లేకదూ?"-అని అడిగాడు...

శేషగిరి, మౌనంగా, తల వూపుతూండగా: "నీకంతచేదసం అయ్యా? ఇష్టం లేకుంటే అమ్మాయితో అబ్బాయి అంతసేపు యెందుకు మాట్లాడుతాడు? అమ్మాయి ...మా అందరికీ నచ్చింది ... ఇక నువ్వు తేల్చవలసింది...వ్యవహారంసరా" అన్నాడు పున్నయ్యగారు.

శ్రీమన్నారాయణగారు, గుండె, దడదడలాడుతూండగా, చిన్నగా చిరునవ్వు నవ్వాడు. ఆయనఇంతవరకూ మేకపోతుగాంభీర్యం యెంతగా ప్రదర్శించినా-ముందుంది కదా - ముసళ్లపండుగ!

పురోహితుడు, శ్రీమన్నారాయణగారి, వయిపుచూస్తూ: "మీ అభిప్రాయం సెలవివ్వండి"-అన్నాడు...

"సెలవివ్వటానికేం వుంది...? వారికి నాపరిస్థితులు తెలుసు .... ఉదారహృదయం గల పెద్దలు వారు. నే వారి అంతస్థుకు తగినవాడ్ని కాను. కానీ నాబిడ్డ భవిష్యత్తు కోసం"-శ్రీమన్నారాయణగారిలా యేమిటో చెప్పబోతూంటే - పున్నయ్యగారు, యింతక్రితంవరకూ, చూపిన, ఓర్మి, సహనం, యేలా మాయం చేసుకొన్నారోగాని, కటువుగా: "ఆ సంగతులన్నీ మిమ్మల్ని యిప్పుడెవరడుగుతున్నారండీ?.... మేం అడిగేది.. కట్నకానుకల విషయం" - అన్నాడు కచ్చితంగా!

శేషగిరీ, శ్రీమన్నారాయణగారూ కూడా ఆయనమాటలకు తెల్లబోయారు,

శ్రీమన్నారాయణగారు: "చిత్రం!...మీరు ఆదర్శవాదులని.... కట్నం నిషేధాన్ని గురించి, ఉపన్యాసాలిచ్చేవారనీ, కట్నం నిర్మూలనకు ప్రయత్నించినవారనీ నాకు తెలుసు... మీలాంటి ఆదర్శవాదులబాంధవ్యం వాంఛించటంకంటె యీ బీదవాడు కోరేదేమిటి? ఏదో లాంఛనాలకు..." అని, యింకా యేమో చెప్పబోతూంటే—

"అవి యెప్పటిమాటలో! ఇప్పుడా గొడవ అవసరం లేదు. నాకున్న ఆస్థిపాస్థుల సంగతి మీకు తెలుసుననుకుంటా... నా కొడుకును చూశారు... ఇక మీఅభిప్రాయం తేల్చండి..."- అన్నాడు పున్నయ్యగారు.

ఇంత కచ్చితంగా, ఆయన అంటూంటే-మరోమారు - శ్రీమన్నారాయణగారు, తెల్లబోవటంకంటె చేయకలిగిందేమీ లేకపోయింది!

కొద్దినిముషాలు నిశ్శబ్దంగా గడిచాయి...

"ఏమండీ ఏమీ మాట్లాడరు?"

"ఏదో బీదవాడ్ని...మీరూ ఆదర్శవాదులు...కట్నంగానూ, కానుకలు గానూ, ఏ పెద్దగా యివ్వలేను. వాటికంటె విలువైన-మా పార్వతిని మీ కప్పచెబుతున్నాను.. ఏదో...అయిదు వేలు..."-

"అయిదు వేలా? ముష్టాడికి వస్తున్నాయి అయిదు వేలు. ఎంత లేనివాళ్లయితేమట్టుకు-మేం ఎంత ఆదర్శవాదులమైతేమట్టుకు-ఏదో లాంఛనప్రాయంగా-మేం కట్నం స్వీకరించితేమాత్రం-మా ఆస్తిపాస్తులసంగతి గుర్తించకుండా-ముష్టి అయిదు వేలనటమా? అదేమీ బాగోలేదు. మరేమయినా చెప్పేది వుందా?"-తీవ్రంగా పున్నయ్యగారనటంతోటే—

శ్రీమన్నారాయణగారు నిర్ఘాంతపోతూ "తామే సెలవివ్వండి"-అన్నాడు.

పున్నయ్యగారు, ఒక్కమారు నవ్వి: "ఆ...ఆలా దారికి రండి బావగారూ... నేనెప్పుడో ఆదర్శవాది నయ్యాననీ-దాన్నింతవరకూ అంటిపెట్టుకు, కూర్చున్నాననుకున్నారా? లేదు. ఆ ఆదర్శాలు అప్పుడే నశించాయి. నిజానికిచూడండి, ఇప్పట్లో, కట్నం తీసుకోకుండా యెవరు పెళ్ళిచేసుకుంటున్నారు?"-అన్నాడు.

"చిత్రం"-అంతకంటే శ్రీమన్నారాయణగారేం అనగలుగుతాడు?

"మీ పార్వతి, మాకు నచ్చింది; మా అబ్బాయికూడా మక్కువచూపిస్తున్నాడు. ఇంతక్రితం, అయిదారుసంబంధాలు చూశాం. ఏవీ నచ్చలేదు. కానీ నేటికి, యిదిమాత్రం మీ అదృష్టంకొద్దీ - మా అదృష్టంకొద్దీ నచ్చటం జరిగింది. అంగవల - యెగు వాళ్లు యిస్తామన్నది మీరు యిచ్చెయ్యండి. ఆ షరతుల కొప్పుకుంటే-కొద్దిరోజుల్లోనే - వివాహం మనం చేసేయవచ్చు."

"చిత్రం" అన్నాడు శ్రీమన్నారాయణగారు.

"సరి. మన షరతులు చెప్పండి పంతులుగారూ" అని పురోహితుడితో అని, తిరిగి తనుతానే: "నేనే చెబుతాలెండి" అంటూ శ్రీమన్నారాయణగారి వయిపు తిరిగి, పున్నయ్యగారిలా చెప్పాడు: "శరభరాజువారి అమ్మాయి - జూనియరు - ఇంటరుమిడియేటు చదువుతోంది, కొంచెం నలుపు. పదివేలు యిస్తామన్నారు. ఆ పదివేలూ యివ్వటానికి మీరు అంగీకరిస్తారా? ఆ పిల్ల నలుపు కాబట్టి వదలివేశాం. మీ అమ్మాయి మాకు నచ్చిందికనుక-ఆ కట్నం కనుకయిస్తే...మా కభ్యంతరం లేదు."

మిత్రుడు సుదర్శనం చెప్పినమాటలు - యిప్పుడు శ్రీమన్నారాయణగారిబుఱ్ఱనిండా వున్నాయి. అయితే పున్నయ్యగారు - గత చరిత్రలలో ఆదర్శం చూపించినా, ప్రస్తుతం చూపించ తలబోయటం లేదు. "కట్నం కనుకయిస్తే..." అని ఆయన అంటున్నాడు గనక-మరి గొడవ లేకుండా - వివాహం నిశ్చయం అయిపోతుందేమో... ఇంతవరకూ - సుముఖంగా-నడచినమాటలు-తాను సాధ్యం కాదంటే విముఖం అయిపోతాయి.

అందువల్ల ఆయన ఏలాగో "చిత్రం... ఆడపిల్లలుకలవాడ్ని...తమ అభిమానం వాంఛిస్తున్నాను" అన్నాడు.

పున్నయ్యగారు చికాకుగా "మీరు పదివేలూ యిస్తారా యివ్వరా?" అని అడిగాడు.

శేషగిరి తండ్రిమాటలు తనకు నచ్చనట్లుగా పైకి కనపడుతున్నా, కిమ్మనక వూరుకొన్నాడు.

శ్రీమన్నారాయణగారు, గుమ్మంలో నిల్చున్న భార్యవైపుచూశాడు. ముందు భవిష్యత్తుసంగతి యేమాత్రం యోచనచేయకుండా "ఒప్పుకోండి" అన్నట్లుగా - సంజ్ఞలు చేసింది జ్ఞానాంబ.

శ్రీమన్నారాయణ "సరి" అన్నాడు.

"ఒప్పుకున్నట్లేనా?" పున్నయ్యగారి ప్రశ్న అది!

"ఒప్పుకొన్నానండి.. మరి నన్ను బాధపెట్టకండి" — ప్రార్థనపూర్వకంగా అన్నాడు శ్రీమన్నారాయణగారు.

పున్నయ్యగారు చి[illegible] నవ్వుతూ: "బాధపెట్టడానికేముంది [illegible] ..లాంఛనాలు ఏలాగూ తప్పవుకదా" అన్నాడు!

తిరిగి శ్రీమన్నారాయణగారి గుండె గతుక్కుమంది: "అవేమిటో" అన్నాడేలాగో, ఆయన - లక్ష్మిందేవమ్మ నవ్వుతూండగా—

"అవేం పెద్దగా వుండవులెండి. పెండ్లికుమారుడికి పట్టుబట్టలూ, వెండిచెంబూ, వెండికంచం, వెండిపాంకోళ్ళూ - వియ్యపురాలి లాంఛనాలక్రింద మరో వెయ్యినూటపదహార్లు, నూతనవస్త్రాలు, ఇంక పెండ్లికుమారుడికి యివ్వటానికి ఒక మోటారుసైకిలు..." పున్నయ్యగారిలా చెబుతూంటే—

"నాకేం అవసరం లేదు"— అన్నాడు శేషగిరి!

పున్నయ్యగారు, మాటి, మటమటలాడిస్తూ "అవసరం లేకపోవటం యేమిటే? అవన్నీ లాంఛనాలు. మనకు కావలసినా, అక్కరలేకపోయినా యిటువంటి సమయాలలో వాళ్ళను అడుగుతూండాలి నీ మంచిచెడ్డలు నాకు తెలుసు. మరి మాటాడకు"— అన్నాడు.

శేషగిరి మరి మాట్లాడలేకపోయాడు!

"ఏమంటారు. మరిచా...ఒక రేడియో"-

"నేను పిల్లలు కలవాడ్ని...మీరు నాయెడ దయ చూపించాలి"

లక్ష్మిందేవమ్మ యీ మాటలు విని, భర్తవయిపు ముటు, ముట చూసింది. ఆయన, మరింత కటువుగా: "మీరు పిల్లలు కలవాళ్ళయితే మేం యేం చేయమండీ...మా సంబంధం కావలసి వచ్చినప్పుడు — మా



లల్లూరాం అండ్ కో
(స్థాపితము 1928)
ఎన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన
* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు
* క్యాషు బాక్సులు
లల్లూరాం అండ్ కో
వలగలేటివారి వీధి, : : విజయవాడ 1.
క్రొత్త షోరూమ్ మారుతి సినిమా కెదురుగా

కోర్కెలన్నీ చెల్లించాల్సిందేకదా"— అన్నాడు.

ఏం చేయాలో తెలియని స్థితిలో— శ్రీమన్నారాయణగారు భార్యవైపు చూశాడు. ఆవిడ భర్తను రమ్మన్నట్లుగా చేసంజ్ఞ చేసింది. దిగులుగా—పున్నయ్యగారివంక చూస్తూ, లోపలికి వెళ్ళాడు శ్రీమన్నారాయణగారు..

జ్ఞానాంబ ఆయన్ననుసరించింది... ఇద్దరూ కలసి దొడ్లోకి వెళ్ళారు...

"ఏమిటి యింకా ఆలోచిస్తున్నారు... పదివేల కట్నం యివ్వటాని కంగీకరించారుగా."

"ఊఁ"

"మరి లాంఛనాలదగ్గర- ఆగిపోయారేం.. ఏ పెళ్ళికొడుక్కయినా - అవి యివ్వవలసినవేగా."

"ఈ పదివేలూ ఎక్కడినుంచి తేవటమా అనుకుంటూంటే — ఈ లాంఛనాలు, మరెక్కడ్నించి తీసుకురాగలనే? మన అదృష్టంకొద్దీ - కట్నం లేకుండానే - సంబంధం నిశ్చయం అవుతుందేమో ననుకుంటే - అది యీవిధంగా తయారైంది. నాకేం తోచటంలేదు"—ఈలా శ్రీమన్నారాయణగారంటూంటే:

"ఇంతకూ నచ్చిన సంబంధం - అబ్బాయి బాగున్నాడు....ఏదో విధంగా చూసుకో వచ్చు...'సరి' - అనండి. ఇంత వున్న కుటుంబం. ఒక్కగానొక్క కొడుకు"— జ్ఞానాంబ, కూతురు భవిష్యత్తు, ఆలోచిస్తూ అంది.

"నాకేం అర్థంకావటంలేదు..."— అంటూ యింట్లోకి శ్రీమన్నారాయణగారు వస్తూంటే, వెలుపలిగుమ్మంప్రక్కన వెక్కి వెక్కి యేడుస్తూ, నిల్చున్న పార్వతి ఆయనకు కన్పించింది...

శ్రీమన్నారాయణగారి గుండె బేజారయిపోయింది. మేకపోతుగాంభీర్యం వహించివున్న ఆయన ఒక్కసారిగా అణిగిపోయాడు...

"ఏం..ఎందుకమ్మా...ఏడుస్తున్నావ్?" అని అడిగాడాయన!

"నాన్నా యీ సంబంధానికి మీరు ఒప్పుకోవద్దు"—

"ఏం..." - నిర్ఘాంతపోతూ, అన్నాడు శ్రీమన్నారాయణగారు.

"ఇష్టంలేదు" - బొంగురుపోయిన కంఠం నుంచి - ఇది పార్వతి జవాబు.

"అబ్బాయి నీకు నచ్చలేదా?"

"అబ్బాయి నచ్చితేమాత్రం...నాన్నా! ఆ అబ్బాయికోసం..ఆ తండ్రి కోరే కట్నం నాకు నచ్చలేదు...నా సుఖంకోసం - మీరా కట్నం యిచ్చినా - నే నాయన్ని పెండ్లిచేసుకోను... రేపు - అంత కట్నం యిచ్చి పెండ్లిచేసిన తరువాత, మీ గతేం కాను నాన్నా? చెల్లెళ్ళకు పెళ్ళిళ్లు చేయనవసరం లేదా?"—పార్వతి యీలా అంటూంటే శ్రీమన్నారాయణగారి కామె వుద్దేశం అర్థమయింది.

ఆయన, "ఛా పిచ్చిపిల్లా! వాళ్ళ భవిష్యత్తుకేం..దక్కగా వుంటుంది...నీ కిప్పుడు చూస్తున్నవిధంగా నే వాళ్లకూ తగిన సంబంధాలు చూస్తాను..మనకేం - నువ్వేం దిగులు పడకు" అంటూ - ఒకమూల పార్వతి ఏమో చెబుతున్నా, విన్పించుకోకుండా, బయటకు వచ్చేశాడు... తెల్లబోతూన్న పార్వతి తండ్రి, వెనుక నే, కన్నీళ్లు తుడుచుకుంటూ, గుమ్మం దగ్గరకు వచ్చి గుమ్మంచాటునుండి- వాళ్ల సంభాషణ వినసాగింది:

"ఏమండీ .... మాకు బండి టయిమవుతోంది..."-అన్నాడు-పున్నయ్యగారు.

"ఈపూట మీరు వెళ్లడానికి వీల్లేదు"— పామరస్యపరిష్కారంకోసం, ప్రయత్నించే వ్యక్తివిధంగా అన్నాడు శ్రీమన్నారాయణగారు.....పున్నయ్య నవ్వాడు: "అవన్నీ తర్వాత... ముందేం చేశారు... లాంఛనాలు యివ్వటానికి అంగీకరించినట్లేనా?"—

"నా స్థితిగతులు పూర్తిగా మీకు తెలుసు. మీబోటివారితో, తూగేశక్తి నాకు లేకున్నా ఆపర్మవాదులని - మిమ్మల్ని గూర్చి అనేకమంది చెప్పివుండటంచేత - మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను... మీరు కోరినకట్నం యిస్తున్నానుకనుక - అదే నా శక్తికి మించినది గనుక - దయయుంచి అనుగ్రహించండి" - పున్నయ్యగారికి మిక్కుటంగా కోపం వచ్చేసింది. "నే అడిగేదేమిటి? మీరు చెప్పేదేమిటి?" - అన్నాడాయన.

శేషగిరి తండ్రివయిపు చూసి, మూతి ముటముట లాడించాడు.

శ్రీమన్నారాయణగారు "క్షమించండి - మీరడిగే లాంఛనాలకు బదులుగా ఒక వేయి రూపాయలు ముట్టచెప్పుకుంటాను. అన్యథా భావించక అంగీకరించండి" అన్నాడు.

"ముష్టి వేయిరూపాయలు" అంది లక్ష్మీదేవమ్మ.

"డబ్బు రొవరికి కావాలండీ.లాంఛనాలు గానీ" - అన్నాడు పున్నయ్యగారు.

పురోహితుడు: "అవునంటూ" పున్నయ్యగారి మాటలతో శృతి కలిపాడు. ఆయన నామమాత్రంగా వచ్చినా, మంచి చెడ్డలు మాట్లాడుకునే వ్యక్తి పున్నయ్యగారే అయ్యాడు!

"నాకష్టసుఖాలు మీరేం గుర్తించరన్న మాట? నా మనవి మీకేం అవసరం లేదన్న మాట? మీరుకూడా ఆడబిడ్డల తల్లిదండ్రులయివుంటే - కొద్దిమాత్రంగా నయినా — సాధకబాధకాలు అర్థం అయివుండేవి" — చివరకు శ్రీమన్నారాయణగారిలా ఉద్రేకంతో అంటూంటే—.

"మీ సాధకబాధకాలు నాకెందుకండీ" అని వెక్కిరింపుగా నవ్వాడు పున్నయ్యగారు.

శ్రీమన్నారాయణగారికి వుద్రేకం పెరిగింది. "సరి....మీరడిగిన కట్నకానుకలు యివ్వడానికి నే సిద్ధపడ్డాను. ఇంకా ఏమయినా వున్నాయా....ఊఁ కానివ్వండి"— అన్నాడు పిచ్చివాడిలాగ!

"మరేంవున్నాయి ... ఈ లాంఛనాలు మీతూ యిచ్చుకుంటాం. వైభవంగా పెండ్లి చేసుకుంటాం. రెండు వందల దాకా మా బంధువులు వస్తారు ... అందరినీ తగిన విధముగా గౌరవం చేయాలి. మరి ముహూర్తం నిర్ణయించుకోటమే తర్వాయి" అంటుంటే.

"ఆగండి" - అంటూ ఎఱ్ఱబడినవదనంతో కళ్ళతో - పార్వతి వేగంగా అక్కడికి వచ్చి, అక్కడివాళ్ళంతా తెల్లబోతుంటే శ్రీమన్నారాయణగారు, "లోనికి వెళ్లిపోమ్మా—" అని వారించుతూ ఉంటే పున్నయ్యగారివయిపుచూస్తూ "నమస్కారం. అవబోయే మామగారూ...మీ షరతులన్నీ అయిపోయాయా? ఇంకా వున్నాయా?" అని అడిగింది. శేషగిరి పార్వతివైపు చూస్తున్నాడు. లక్ష్మీదేవమ్మ, తదితరులు తెల్లబోతున్నారు. నిర్ఘాంతపోతున్న పున్నయ్య

బహుమతి రు. 500
(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్ల వెంట్రుకలను పోగొట్టును

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మాసువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-

GENERAL LABORATARIES,
(H. O) P O Rajdhanwar (H Bagh).

గారు, యెలాగో చిన్నగా నవ్వి, “ఆ అయిపోయాయమ్మా” - అన్నాడు.

“నేను మీకు నచ్చానా?”

“దివ్యంగా.”

“మీ అబ్బాయికి?”

“వాడికి నువ్వు యెప్పుడో నచ్చావ్” అంటూ పున్నయ్యగారు కొడుకువయిపు చూశాడు. శేషగిరి అయోమయ పరిస్థితిలో తలదించుకొన్నాడు.

“ఏమండీ అత్తగారూ మీకు?”—

“నాకూ నచ్చావమ్మా” - అంది లక్ష్మీదేవమ్మ, తెలతెలబోతూ!

“మరయితే నన్ను మీ అబ్బాయికిచ్చి వివాహం చేస్తారా?”

“ఓ దివ్యంగా... మీ నాన్నగారు — కట్నం యివ్వటానికీ - లాంఛనాలు యివ్వటానికీ అంగీకరించారుగా... మరి ముహూర్తము పెట్టించుకోటమే తర్వాయి. నువ్వు మాయింటి కోడలవయిపోతావు” పున్నయ్యగారు ఒకమూల గుండె దడదడలాడుతూండగా అంటూంటే—

“ఒకమాట” - అంది పార్వతి.

“ఏమిటది?” - పున్నయ్యగారు పార్వతి వయిపు చూశాడు.

“నేను మీకు నచ్చినప్పుడు కట్నకానుకలతో నిమిత్తమేమిటి?”

“కట్నకానుకలతోనూ - లాంఛనాలతోనూ - నువ్వు మాకు కావాలి.”

“అవి లేకుంటే నేను మీకు అవసరం లేనుకదూ?”

పున్నయ్యగారు మౌనంగా వూరుకొన్నాడు.

“తప్పమ్మా! తప్పు...మనం అలామాట్లాడగూడదు”-అని శ్రీమన్నారాయణగారు, పార్వతిని వారించుతున్నా అక్కడికి వచ్చి జ్ఞానాంబ కళ్లనీళ్లు పెట్టకొని, నెమ్మదిగా యేడుస్తున్నా వాళ్ళను లక్ష్యపెట్టకుండా—

“అయితే...వచ్చినదారినే తాము తప్పక దయచేయవచ్చు” -అంది...పున్నయ్యగారు నిర్ఘాంతపోతూ: “అదేమిటి?”-అన్నాడు.

“మీరు నన్ను కట్నకానుకలతో...మీ కోడల్ని చేసుకుందామనుకుంటున్నారు. మీ అబ్బాయిమీద నామనసు నిలచింది. కానీ కట్నకానుకలు పుచ్చుకొని ‘ఆదర్శవాదు’లనిపించుకొనే - మీబోటి పెద్దలకు కోడలవటం నాకిష్టంలేదు. కట్నం పుచ్చుకొనకుండా నన్ను మీకోడలుగా గ్రహించినా సరే లేకుంటే ..’-ఈవిధంగా వుద్రేకంతో పార్వతి యింకా యేమిటేమిటో అనబోతూంటే - జ్ఞానాంబ, తదితర ముత్తయిదువులూ, ఆమెను బలాత్కారంగా అక్కడనుంచి తీసుకుపోయారు .. శ్రీమన్నారాయణగారు: “ఏదో కుర్రది...నోటికి వచ్చినట్లుగా అంది. మరోవిధంగా భావించకండి, ”అని బతిమాలుతూంటే- జ్ఞానాంబ, తిరిగివచ్చి, లక్ష్మీదేవమ్మకు నచ్చచెప్ప ప్రయత్నిస్తూంటే - శేషగిరి, దిగాలుగా వాళ్లవయిపు చూస్తూండగా - పురోహితుడు - తెల్లబోతూంటే—

పున్నయ్యగారు, తెచ్చుకొన్న కోపంతో: “చేసినగౌరవం చాలులేవయ్యా. పొగరుబోతుపిల్ల. పెద్దా పిన్నా తారతమ్యం లేకుండా మాట్లాడింది. మరి నీ గుమ్మంలో నిల్చోటానికిగూడా అర్హత లేదు. ఊ నడవండి” - అంటూ - ఏదో చెప్పబోతున్న - శేషగిరిని, రెక్కపట్టుకు బయటకు ఈడ్చుకుపోయాడు. లక్ష్మీదేవమ్మ: “ఈ మహాశక్తి నాకు కోడలేవిటి” - అంటూ బయటకు వచ్చింది.

“అమ్మాయిని నేను”- అని శేషగిరి బయటకువస్తూ అనబోయాడు - కానీ ఏమాత్రం అతగాడ్ని లక్ష్యపెట్టకుండా - పున్నయ్యగారు లాక్కుపోయాడు!

ఆనందంతో వుండవలసిన ఆ కుటుంబం దుఃఖసముద్రంలో నిండిపోయింది! వాళ్లు స్టేషనుకు వెళ్ళిపోయారు!

“ఏమయినా ఆడపిల్ల అలా మాట్లాడవచ్చునా? ఈ సంగతి తెలిస్తే మరెవళ్ళయినా చూడటానికి వస్తారా?” - అని అక్కడి అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకున్నారు.

జ్ఞానాంబా, శ్రీమన్నారాయణగారు — “అంతా మాకర్మ” - అని కళ్ళనీళ్లు పెట్టుకొన్నారు.

“వాళ్లమాటలు నాకలా వుద్రేకం తెప్పించాయి. అనేశాను”-అంటూ పార్వతి యేడుస్తూంది.

* * *

తర్వాత ఒక వారంరోజులు భారంగా గడిచాయి ...

ఏదో సంబంధంచూసి - పార్వతికి త్వరలోనే వివాహం చేసేయాలనే నిశ్చయానికి వచ్చిన శ్రీమన్నారాయణగారు - ఈ వారంరోజులూ తెగతిరిగాడు...పార్వతినిగురించి అనోటా ఆనోటావచ్చినమాటల మూలంగా

FPY. 26-TEL

‘నా గొంతుక బాగా
పుండు పడినందున
నేనుమ్రింగలేక పోయాను’
కాని పెప్స్
ఉపశమనం కలిగించి
పుండును మాన్పినవి

పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన, నివారకసారములు కలవి, మీరు పెప్స్‌ను చప్పరించునపుడు ఈ సారములు ఆవిరి అయి, మీ శ్వాసద్వారా గొంతుకలోనికి, శ్వాసమార్గం, శ్వాసకోశాలలోనికి కొనిపోబడుతాయి. ఇలా అవి సరాసరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి. అందుకే పెప్స్ అంతశక్తివంతమై, జగద్విఖ్యాతిగాంచినవి. పెప్స్ దగ్గులను అణచివేస్తాయి, గొంతుపుండు బాధను ఉపశమింపజేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్‌ఫ్లుయేంజా, బ్రోంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి.

PEPS

పెప్స్ గొంతు, రొమ్ము టేబ్లెట్లు మందులమ్మేవారి అందరివద్దా లభిస్తాయి.

మద్రాసు సోల్ ఏజంట్లు: దాదా & కంపెనీ, పార్కుటౌన్, మద్రాసు-3.

★ పార్వతి ★

శ్రీమన్నారాయణ గారి ప్రయత్నాలు చాలావరకు విఫలమయ్యాయి. పెండ్లికూతురుని చూడటానికి గూడా - పెళ్ళి పెద్దలు రావటంలేదు. విసిగి వేసారిన శ్రీమన్నారాయణగారికి అతుకులబొంత సంబంధం వొకటి తారసపడ్డది... వరుడు స్కూలుఫైనలు యూడోమారు చదువుతున్నాడు; ఆస్తిపాస్తులు వాళ్ళకు పెద్దగా లేవు: కానీ కట్నమాత్రం అయిదువేలు కావాలిట; పైగా లాంఛనాలు.

"ఏదో ఒక సంబంధం. యేదో ఆస్తి వున్నదిగదా" అనుకొని,

"సరే...అమ్మాయిని చూసుకోటానికి రండి" అని వాళ్లతో ఆయన చెప్పాడు.

"ఫలానా - నాటిబండికి మేం రాగలం. స్టేషనుకు రండి" అని వాళ్లు చెప్పారు.

"చిత్తం...మరచిపోకండి" అని శ్రీమన్నారాయణ తిరిగి యింటికి వచ్చాడు.

* * *

మరి రెండురోజులు గడిచాయి...

పార్వతిని చూసుకోటానికి ఆ దినమే పెళ్ళివారు వస్తారు. శ్రీమన్నారాయణగారు, వలసిన యేర్పాట్లు చేసి—పార్వతిని జాగ్రత్తగా మసులుకోవలసిందని హెచ్చరికచేసి, వారి నాహ్వానించటానికి స్టేషనుకు వెళ్ళాడు.

రైలు వచ్చింది. పెళ్ళి వారు బండి దిగారు...

"వచ్చారా" - అని ఆప్యాయతతో అతను కాబోయే వియ్యంకుడిని పలకరించాడు శ్రీమన్నారాయణగారు.

"ఆ...మీతో కొంచెం మాటాడాలి..." అన్నాడాయన.

"ఇంటికి పోతున్నాముగా."

"పోకుండానే మాటాడాలి... అలా ముందుకు పడదాం" - అంటూ అతను కాబోయే వియ్యంకుడు పెళ్లికుమారుడిని అక్కడ వదలి, శ్రీమన్నారాయణగారిని, దూరంగా తీసుకుపోయాడు...

ఇద్దరూ - ప్లాటుఫారంమీద నిర్మానుష్యమైన ప్రదేశంలోకి వచ్చారు.

"ఏమిటి?—" శ్రీమన్నారాయణగా రడిగారు.

"మీ అమ్మాయిని గురించి—"

"ఊ...ఏమిటి?" - గుండె దడ దడలాడుతూంటే, తెల్లబోతూ అడిగాడు..శ్రీమన్నారాయణగారు....

"మీ అమ్మాయి పొగరుబోతుపిల్లట... మగవాళ్లతో యెదిరించి మాట్లాడుతుందట. నాతో నలుగురయిదుగురు చెప్పారు."

శ్రీమన్నారాయణగారికి నోట్లో నుండి పోయింది కానీ యేలాగో తమాయించుకొని: "మీరు చూస్తారుగా ... అవన్నీ వుత్తుత్త మాటలు. నేనంటే కిట్టనివాళ్లు చెప్పే అసత్యపు మాటలు" అన్నాడు...

"ఏమయినా నా కభ్యంతరం లేదనుకోండి ...కానీ"—

"మరేమిటి"

"మీ అమ్మాయి యెదిరించే పిల్లయినా... మరో వేయిరూపాయలకట్నం యెక్కువయిస్తే - నిశ్చయించుకోటానికి మా కభ్యంతరం లేదు."- అన్నాడాయన.

శ్రీమన్నారాయణగారి కీమాట నిజంగా నోట్లో మంచిపోయింది:

"అమ్మాయి ఎదిరింపులకూ, పొగరుబోతుతనానికీ- ఈకట్నానికీ లంకె అన్నమాట?"- అన్నాడు!

వియ్యంకుడు నవ్వుతూ: "ఆ..." అన్నాడు.

శ్రీమన్నారాయణగారు కోపంతో: "అయితే మీరు...మరి ముందుకు దయ చేయవలసిన అవసరంలేదు. వచ్చినమార్గానే దయచేయండి" అంటూ — తిరిగిచూడకుండా యింటికి నడిచాడు.

* * *

కోపంతోనూ - వేగంతోనూ - శ్రీమన్నారాయణగారు ఇంటికి వచ్చి, "అంతా మన అదృష్టం. ఇక ఈ జన్మలో దానికి పెళ్ళి వదు. పొగరుబోతుపిల్లఅనీ, ఎదిరించేదనీ— వాడవాడలా ప్రాకిపోయింది" అని పళ్ళు పట, పట లాడిస్తూంటే—

జ్ఞానాంబ యేమీ అర్థంగాక తెల్లబోతూంటే—

గదిలో పార్వతి వెక్కి వెక్కి యేడుస్తూండగా—

పున్నయ్యగారి పురోహితుడు, అప్పుడే రైలుబండి దిగి అక్కడికి వచ్చి: "నన్ను పున్నయ్యగారు పంపించారు" అంటూ ఒక కవరిచ్చాడు.

జ్ఞానాంబ...అర్థంగాని పరిస్థితిలో భర్తవయిపు చూస్తూండగా—

శ్రీమన్నారాయణగారు, ఆదుర్దాతో ఆ కవరు చించి, అందలి విషయాలు చదువుకొని, ఆనందం వ్యక్తపరుస్తూ "ఏలాగయినా మా పార్వతి అదృష్టవంతురాలు" అన్నాడు.

"ఏమిటండీ?" అని జ్ఞానాంబ ఆదుర్దాగా భర్తవయిపు చూసింది.

"మనం అదృష్టవంతులం...కొడుకు శేషగిరి పట్టుదల కారణంగా, పున్నయ్యగారు ఏమాత్రం కట్నం తీసుకోకండా మన పార్వతిని కోడలుగా స్వీకరించటానికి అంగీకరించారు. పార్వతిని తప్పించి మరే పిల్లనూ ఆ కుఱ్ఱవాడు పెండ్లి చేసుకోనన్నాడట. అందువల్ల కట్నకానుకలమీద ఆశ వదలి, మన పార్వతిని వారి కోడల్ని చేసుకోటానికి పున్నయ్యగా రంగీకరించారు. ఈ సాయంకాలమే తాంబూలాలు పుచ్చుకోటానికి, ముహూర్త నిశ్చయం చేసుకొనటానికి వారు బయలుదేరి వస్తున్నారట..." అని సంతోషంతో శ్రీమన్నారాయణగారు చెబుతూంటే—

"ముందు యేర్పాట్లు వలసినవి చేసుకోమని చెప్పటంకోసం, పున్నయ్యగారు నన్ను పంపించారండి" అని చెప్పాడు, పున్నయ్యగారి పురోహితుడు.

ఇంకేముంది?

"ఎంత అదృష్టం! ఎంత అదృష్టం" అని జ్ఞానాంబా, పిల్లలూ, మురిసిపోతూంటే—

గదిలోవున్న పార్వతికళ్లలో నీళ్ళు నిలచాయి. అవి శోకాశ్రువులు కావు, ఆనంద బాష్పాలు.

అవి కోరినవ్యక్తి భర్తగా లభ్యమయినందుకు కాదు—

తన ఆశయాలకు అనుగుణంగా—

కోరినవ్యక్తి కట్నకానుకల వాంఛ లేకుండా, తన్ను వివాహం చేసుకోబోతున్నందుకు. ★



డిస్ట్రిబ్యూటర్లు. సీతారామ్ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్,) విజయవాడ -1.